# ఆదర్శ బానిసలు

**నా**కు చాలా మంది తెల్లవాళ్లు తటస్థపడ్డారు గాని నా అంతట నేను వారి పరిచయం ఎన్నడూ చేసుకోలేదు. పారతంత్ర్యంలో పుట్టిపెరిగిన వాడు ఆత్మాభిమానం ప్రకటించు కోవడానికి ఇంతకన్న మరో మార్గం లేదు.

ఈ ప్రొఫెసరు నన్ను తనంతటతానే పలకరించాడు. ఆయన మాట్లాడే పద్ధతి చూస్తే ఆయన ఇంగ్లిష్ వాడని నాకర్థమయింది. మధ్య యూరపుకు చెందిన యూదజాతి వాళ్లతో నాకు బాగా పరిచయం ఉంది. ఈయన కూడా ఆ జాతి వాడేమోనని కూడా సందేహం కలిగింది. ఆ సందేహాన్ని నేను వెంటనే నివారణ చేసుకోలేదు.

ఆయన మొదట్లో నన్ను అనేక రకాల ప్రశ్నలు వేశాడు. ఫ్రాంటియరు మెయిలు ఢిల్లీ చేరేటప్పటికి ఎంతవుతుందన్నాడు. ఇండియాలో రైళ్లు సకాలానికి చేరవెందు చేతనన్నాడు. మా పెట్టెలో ఎక్కిన గుజరాతీ కుటుంబం వారు మాట్లాడేది నాకర్థమవుతుందా అన్నాడు. నువు చదివే పుస్తకం ఏమిటన్నాడు. పుస్తకం తీసుకు తిరగవేస్తూ ఒక నాటకం చూసి 'హో' అన్నాడు.

'ఏమిటి విశేషం!' అన్నాడు.

'1925లో ఈ నాటకాన్ని వార్సాలో చూశాను. అందులో ఏమీ లేకపోయినా నాటకం చాలా జయప్రదంగా నడిచింది' అన్నాడు ప్రొఫెసర్.

ఆయన చెప్పిన నాటకం నేను చదివాను. ఆ నాటకంలో ఒక కంపెనీవారు కృత్రిమ మనుష్యులను తయారు చేసి దేశ దేశాలకూ అమ్ముతారు. చివరకు ఈ కృత్రిమ మనుష్యులు అసలు మనుష్యుల మీద తిరుగుబాటు చేసి మానవజాతిని నిర్మూలం చేస్తారు. కృత్రిమ మనుష్యులకు పిల్లల్ని కనే శక్తిలేదు. అందుచేత ప్రపంచం నిర్మానుష్యం అయిపోయేటట్టున్న సమయంలో ఈ కృత్రిమ మనుష్యులలో మానవ లక్షణాలు పొడగడతాయి. అక్కడ నాటకం అయిపోతుంది.

'నాకా నాటకం బాగున్నట్టు కనపడింది' అన్నాను.

'నాన్సెన్స్! కృత్రిమ మనుష్యులను ఎవరూ తయారు చెయ్యలేదు. అదంతా కట్టుకథ మనుష్యులనే యంత్రాలుగా తయారు చెయ్యవచ్చు. అది యథార్థం. ఆ పని జరిగింది. ఇరవై నాలుగు ఇంజెక్షన్లుతో ఏ మనిషినైనా ఆదర్శ బానిసగా చేసి వెయ్యవచ్చు.

'మానవ శరీరంలో అనేక భాగాలలో కొన్ని కొన్ని పరిస్థితులలో అనేక రకాలు ద్రవణం జరుగుతుంది. మానవుడి మేధస్సులో జరిగే ద్రవణం గురించి శాస్త్రవేత్తలకు దాదాపు ఏమీ తెలియదు. అమూల్యమైన పరిశోధనలు చేయడానికి అవకాశం ఉన్నది గాని మీ ప్రజాస్వామికం అటువంటి పరిశోధనలకు ఒప్పుకోదు. ఒక్క నాజీ పరిపాలనలోనే అది సాధ్యమయింది.

'నాజీ పార్టీలో అతి విచిత్రమైన వ్యక్తులు ముందుకు వచ్చారు. మీరంతా మానవత్వం అనుకునేది వాళ్లలో నిశ్శేషంగా పోయింది. వాళ్లు తమ యజమానులు ఏం చెయ్యమంటే అది చేస్తారు. వారిలో వ్యక్తిత్వం ఏమీ ఉండదు. ఆహార నిద్రలు కోరకుండా ఎంత అపాయకరమైన పని అయినా చేస్తారు. వారి శరీరాలు కృశించవచ్చు. అపాయాన్ని ఎదుర్కొనేటప్పుడు వారి శరీరాలు చలికి వణికినట్టు వణకవచ్చు కాని వారి బుద్ధి మాత్రం మార్పు చెందదు. అది సొంతాన ఆలోచించదు – ఆలోచించలేదు.

'మనం అలసటా, భయమూ, అశక్తతా అనుకునేవి పూర్తిగా శరీరానికి సంబంధించినవి కావు. అవి మెదడుకు సంబంధించినవి. మెదడు ఈ విషయాలను గురించి స్వతంత్రంగా ఆలోచించలేనప్పుడు శరీరం చాలా అధికమైన పని చేస్తుంది. డస్సి కింద పడిపోయేవరకూ మనిషి యంత్రం మాదిరిగా పని చెయ్యవచ్చు. భయం విషయంలో కూడా అంతే. భయం జాస్తిగా కలిగినప్పుడు మనస్సు అతి వేగంగా పనిచెయ్యవచ్చు. అసలే పని చెయ్యకపోవచ్చు. అతి వేగంగా పనిచేసినప్పుడు పారిపోతాం. అసలు పనిచెయ్యకపోతే కొయ్యబారిపోతాం.

'మనస్సు స్వతంత్రంగా పని చెయ్యకుండా ఉండే పరిస్థితిలో మేధస్సులో ఎటువంటి ద్రవణం జరుగుతుంది అనే విషయమై ముగ్గురు జర్మను శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. ఎనిమిది మంది నాజీ యువకులు ఈ పరిశోధనలకుగాను చచ్చిపోవడానికి అంగీకరించారు. వారిని గెస్టపో వారు అరెస్టు చేసినట్టు నటించి పట్టుకుపోయినారు. వారి మెదడులు తెరిచి చూడకముందు వారిలో ఉండే అమానుష శక్తుల్ని బాగా రెచ్చగొట్టారు.

'ఈ పరిశోధనలు సాగించిన శాస్త్రవేత్తలను ఒక సందేహం బాధించింది – ఈ విధంగా మానవత్వం ఆపేటటువంటి దాన్ని పోగొట్టుకున్న వాళ్ల మేధస్సులో కొత్త ద్రవణం జరుగుతుందా? మామూలుగా ఉండేది హరించి పోతుందా అని. ఏమైనా అది పరిశోధనల వల్ల మాత్రమే తెలియదగిన సంగతి.

'ఈ పరిశోధనలు అనుకున్న దానికంటె కూడా అద్భుత విజయం పొందాయని నేను వేరే చెప్పనవసరం లేదు. మనుష్యులను భావోన్మత్తులుగా – ఫానటిక్కుగా – తయారు చేసే రసాయనిక వస్తువు శాస్త్రజ్ఞుల చేతిలోపడింది. ఈ రసాయనాన్ని ఎట్లా కృత్రిమంగా

తయారు చేయడం, దాన్ని ఏ విధంగా మనుష్యుల మేధస్సులోకి పంపకం చెయ్యడం అనే సమస్యలు శాస్త్రవేత్తలను చాలాకాలం బాధించాయి.

'ఆ రసాయానాన్ని కృత్రిమంగా ఆ ఇంజెక్షను రూపంలో, తయారు చేయడానికి చాలాకాలం పట్టింది. కాని దాన్ని ఇంజక్షనుగా ఇవ్వడం పెద్ద సమస్య అయిపోయింది. ఆ తరువాత మోతాదు తెలియలేదు. ఈ చిక్కులన్నీ తొలగిపోయే లోపుగా యుద్ధం ఆరంభమయింది. హిట్లరు అనేక విధాల చాలా తెలివిగల వాడేగాని ప్రపంచ యుద్ధం అతను ఊహించిన దానికన్న దాదాపు పన్నెండు నెలలు ముందుగా వచ్చింది' అన్నాడు ప్రొఫెసరు.

'ఏమిటి ఈ ఇంజక్షను వల్ల లాభాలు!' అన్నాను.

'లాభాలా! ఇవాళ ప్రపంచానికి కావలసింది ఈ ఇంజెక్షనే. ప్రపంచానికంతటికీ ఒకే ఆధిపత్యం ఏర్పడేదాకా మన సమస్యలు పరిష్కారం కావు. ఒకే ప్రపంచమని అరవగానే సరా? అంతులేని స్వతంత్ర రాజ్యాలతో ఓకే ప్రపంచం ఎట్లా ఏర్పడుతుంది! ప్రజాస్వామిక మంటే అరాచకానికి పర్యాయపదం. ప్రజాస్వామిక సూత్రాల మీద ఒకే ప్రపంచం ఏర్పడుతుంది' చరిత్ర చదువు. మహా పురుషులెవరు? ప్రజల మీద ఆధిపత్యం సంపాదించిన వాళ్లు. ఆఖరుకు మీ మార్క్సు కూడా ప్రజల మీద ఆధిపత్యం సంపాదించినవాడే. ఇవాళ ప్రపంచంలో జరుగుతున్న ఉద్యమం ఏమిటి? ప్రపంచాధిపత్యానికి అమెరికా ప్రయత్నిస్తున్నది. అమెరికను సైనికులు ప్రపంచాధిపత్యం కోసం చచ్చిపోతారా? పోరు.

ప్రపంచ రాజకీయాలు హాస్యాస్పదంగా ఉండడానికిదే కారణం - ఆశయాలకూ సిద్ధాంతాలకూ సంబంధ లేదు. జాతితత్వం తీసుకో. మిగిలిన జాతులను లోబరుచు కునేటందుకు ప్రయత్నించడానికి ప్రతిజాతికీ హక్కున్నది. ఈ ప్రయత్నం చాతకాకుండా ప్రతిజాతీ, ప్రతి వర్గమూ చేస్తూనే ఉన్నాయి. కాని వారిదగ్గిర ఈ ఇంజెక్షను లేదు. ఈ ఇంజెక్షనును జయప్రదంగా ఉపయోగించిన వాళ్లు. ఒక్క నాజీలే!'

నేను నవ్వాను. నాజీల విజయం ప్రపంచం ఎరగదు. ఈ ప్రొఫెసరుగారు నాజీల విజయం గురించి అంత గట్టిగా బల్లగుద్ది మాట్లాడటం వింటే నాకు నవ్వాగలేదు.

'నీకేవో లేనిపోని సిద్ధాంతాలున్నాయి. నువేకాదు, ప్రపంచంలో ఇవాళ నూటికి నూరుమంది ఆచరణయోగ్యం గాని సిద్ధాంతాలలో చిక్కుకుని తికమకపడుతున్నారు. ఏ కొద్దిమందికో తప్ప ఇంకా జ్ఞానోదయం కాలేదు' అన్నాడు ప్రొఫెసర్ తీవ్రంగా.

నేను అందరివంటి వాణ్ని కాను. నేను మంచిచెడ్డలను గురించి పాటించను. నిర్విఘ్నంగా సాగిపోయేదైతే ఏ సిద్ధాంతాన్నైనా ఆమోదిస్తాను. ఈ ఇంజెక్షను సహాయంతో నాజీలు విజయం ఎందుకు సంపాదించలేదు? సంపాదించారని మీరంటున్నారు. సంపాదించలేదని నేనంటున్నాను' అన్నాను.

ప్రొఫెసరు కొంచెం యోచించి 'ఇంజెక్షను విజయవంతమయింద'ని కేవలం పరిశోధనా దృష్టితో అన్నాను. అంతే, ఈ ఇంజెక్షను పుచ్చుకున్న నాజీ సైనికులు అత్యద్భుతంగా యుద్ధం చేశారు. వారిలో ఎక్కడా తిరుగుబాటు చిహ్నాలు కనిపించలేదు. వాళ్లు పారిపోలేదు, ప్రాణం దక్కించుకొనడానికి ప్రయత్నించలేదు, సొంతంగా ఆలోచించ లేదు, స్వార్థం ప్రకటించలేదు. అటువంటి సైనికులను ఏ దేశమూ ఎన్నడూ తయారు చెయ్యలేదు, ఇక చెయ్యదు.'

'నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు. నాజీలు ఎందుకు ఓడారు!'

'ఈ ఇంజెక్షను గురించి ఇంకా పరిశోధనలు జరిగి ఉంటే ఓడరు.'

'నాజీ సైనికులే కాక, ఇంజెక్షను కూడా ఓడిందంటారా ఏం, కొంపదీసి!' అన్నాను.

'కాదు. ఇంజెక్షను దానిపని నెరవేర్చింది. అంతవరకూ అది విజయవంతమే అయింది. కాని కొన్ని అనుకోని చిక్కులు తటస్థపడ్డాయి. ఈ ఇంజెక్షను పుచ్చుకొన్న సైనికులు కొంత ప్రచారానికి గురిచేయబడ్డారు. రష్యను సైనికులను గురించీ బ్రిటిష్ అమెరికన్ సైనికులను గురించీ వారికి కొన్ని విషయాలు చెప్పబడ్డాయి. తీరా ముఖాముఖీ ఈ శత్రు సైనికులను చూసేసరికి వారి శరీరాలలో రాగూడని చైతన్యం వచ్చింది. వారికి పారిపోయే శక్తి లేదుకనుక సరిపోయింది గాని లేకపోతే పారిపోవలసిన వాళ్లే. దూరపు యుద్ధంలో నాజీ సైనికులు ఎంత నిపుణతను కనబరిచారో దొమ్మి యుద్ధంలో అంత అసమర్థులైపోయినారు.

'స్టాలిన్‌గ్రాడ్ యుద్ధం జ్ఞాపకం ఉందా? అజేయంగా స్టాలిన్‌గ్రాడ్‌లో జొరబడ్డ నాజీ సైనికులు వీథులలో యుద్ధం చెయ్యవలిసి వచ్చేసరికి, రష్యను సైనికులు సమీపంగా కనిపించేసరికి చేచిక్కిన విజయాన్ని కోల్పోయి నల్లులు చచ్చినట్టు చావసాగారు. స్టాలిన్‌గ్రాడ్ అపజయాన్ని చరిత్ర వివరించలేదు.'

'మేం దాన్ని స్టాలిన్‌గ్రాడ్ విజయం అంటున్నాం' అన్నాను.

ప్రొఫెసర్ నామాట వినిపించుకోలేదు. చెప్పుకుపోయినాడు 'పారిపోవలేక' పోవటం కూడా నాజీలకు కొన్ని పరిస్థితులలో నష్టమయింది. యూరపులో చిన్న చిన్న గుంపులుగా మిగిలిపోయిన నాజీ సైనికులు అక్కడే నిలబడి మారణహోమం కాకుండా జర్మనీకి తిరిగి వచ్చినట్లయితే శత్రుసేనలు నిరాఘాటంగా బెర్లిన్ మీదపడి ఉండవు. బెర్లిన్ వీథుల్లో యుద్ధమనేసరికి మళ్లీ శత్రువులదే గెలుపైంది.

'ఇంకొక ప్రమాదం కూడా జరిగింది. తమ సోదర సైనికులు చచ్చిపోతుంటే జర్మను సైనికులకు ఉద్రేకం హెచ్చలేదు. పైపెచ్చు మరింత అయోమయంగా అయిపోయినారు. వాళ్లకి నాజీ సైనికులు చావరని చెప్పారు. అదొక పొరపాటయింది.

'ఇంకొక చిక్కేం వచ్చిందంటే నాజీ సైనికులు పైనుంచి ఆర్డర్లు రాకుండా ఏమి చెయ్య లేకపోయినారు. యుద్ధరంగం సంకుచితంగా ఉన్నంత కాలమూ ఆర్డర్లు సక్రమంగా వెళ్లాయి, గాని అది విస్తరించిన కొద్దీ ఇబ్బంది కలిగింది.

'మరొక చిక్కేం వచ్చిందంటే, సేనా నాయకులకు ఈ ఇంజెక్షను ఇవ్వాలో, వద్దో శాస్త్రజ్ఞులకు తెలియలేదు. ఇంజెక్షను పుచ్చుకున్న రోమెల్ చేసిన పొరపాట్లే మళ్లీ మళ్లీ చేసి అపజయం పాలైనాడు. ఇంజెక్షనులు పుచ్చుకొని ప్రష్యను కమాండర్లు ఆఖరు దశలో కుందేళ్లకన్న అన్యాయంగా పరిగెత్తారు. ఇంజెక్షన్లు పుచ్చుకున్న వైమానికులు మొదట్లో లండనును చక్కగా బాంబు చేశారు. బ్రిటిష్ వాళ్లు రాడారుతో జర్మను విమానాలను తప్పుదారి పట్టించేసరికి గుడ్డిగా పోయి గురికి నాలుగు వందల మైళ్ల దూరాన టన్నులకు టన్నుల బాంబులు మైదానాల మీద వేసి తిరిగి వచ్చారు. తీరా యుద్ధం ఆఖరు దశలో ఇంజెక్షను పుచ్చుకొన్న వైమానిక నాయకులు లేక జర్మనీ పెద్ద దెబ్బతిన్నది.'

ప్రొఫెసరుగారు చెప్పే విషయాలన్నీ సబబుగానే ఉన్నాయి. మొదట్లో ఆయన ఈ దిక్కుమాలిన ఇంజెక్షను గురించి గాలికబుర్లు చెబుతున్నాడనుకున్నాను గాని ఒడ్డువరకు అర్థంగాని కొన్ని విషయాలైనా ఇప్పుడర్థం కావడం చేత నిజంగా ఈ ఇంజెక్షనులో ఏదో ఉందని నాకు నమ్మకం కుదిరింది.

కాని ప్రొఫెసరుగారిని ఒక్క ప్రశ్నమాత్రం వేయాలనిపించింది.

'మీ ఇంజెక్షను పరిశోధనలు ఇంకా సాగించడానికి అవకాశం ఉంటే ఏ మార్గంలో పరిశోధనలు సాగించి ఉండేవారో చెప్పగలరా!' అన్నాను.

ప్రొఫెసరుగారు మొహం చిట్లించాడు.

'నన్నడిగితే – హా! – నేనేమంటానంటే – హా! – ఇంజెక్షను ఘాటు చాలలేదు. నాజీ సైనికులను మరింత యంత్రాలుగా తయారు చేసి ఉంటే యుద్ధం ఇంకా చప్పున తేలిపోయేది. ఈ ఇంజెక్షన్ ఫలించాలంటే యుద్ధం వేగం ఇంకా తీవ్రంగా ఉండాలి. ఈ ఇంజెక్షన్ ఇచ్చే అమానుష శక్తులకు తగిన అమానుష యుద్ధం వేగం లేక – హా ! – జర్మనీ ఓడిపోయిందంటాను.

'మీరు పూర్తిగా పొరపడ్డారని నేనంటున్నాను. మీదీ అభిప్రాయమే, నాదీ అభిప్రాయమే. మీరు మనుష్యులకు ఆయుధాలిచ్చి యుద్ధానికి పంపక, మనుష్యులనే ఆయుధాలు చేసి యుద్ధానికి పంపారు. యంత్రాలు మనుష్యులను జయించలేవు. అది పొట్టిమాట. మీ ఇంజెక్షన్ సంగతి ఏమీ తెలియకుండానే మీ సైనికులు యంత్రాలనేది వాసనకట్టి నాబోటి వాళ్లం యుద్ధం ఆరంభం కాగానే జర్మనీ ఓటమి గురించి జోస్యం చెప్పాం. మీ శాస్త్రవేత్తల పరిశోధన కంటే మా జోస్యం విజయవంతం కావడం మీ

శాస్త్రానికి పెద్ద దెబ్బ. ఇది గుడ్డివేటు కావచ్చును. వీ-2లు కూడా మీకు చాలలేదు. ఇంకా ఎంత వేగం కావాలి, మీ ఇంజెక్షన్‌కు? జర్మనీ ఆటంబాంబు కనిపెట్టకపోవడం చాలా అదృష్టమని చాలామంది అభిప్రాయ పడుతున్నారు. జర్మనులకు ఆటంబాంబే ఉంటే గత సంగ్రామం అంతకాలం పట్టేది కాదు. జర్మనీ ఇంకా చాలా ముందుగానే బడేది. ఈ మాట ఎందుకంటున్నానో టెస్టు ట్యూబుల సహాయంతో పరిశోధించి తెలుసుకోండి' అన్నాను.

**సమీక్ష మాసపత్రిక, మే 1949**